క్లుప్తంగా

తోటపేటలో 30 మంది రక్తదానం



ఆర్‌సీఎం చర్చి ఆవరణలో రక్తదానం చేస్తున్న ఫాదర్, సభ్యులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేటలో జయజేసు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ జోసఫ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నేతృత్వంలో చర్చి ఫాదర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఆర్‌ఎంపీ పీవీ సత్యనారాయణ, చర్చి సభ్యులు 34 మంది ఆదివారం రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ పి.దుర్గరాజు రక్తదాన ఆవశ్యకతను వివరించారు. ప్రతి నెలా తమ సంస్థ తరఫున 30 మంది తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు రక్తం అందిస్తున్నామని తెలిపారు. అటువంటి చిన్నారులకు ఉపయోగపడే విధంగా చర్చి సభ్యులు ముందుకు వచ్చి రక్తదానం చేయడంపై అభినందనలు తెలిపారు. చర్చి ఫాదర్ జోసఫ్ ప్రభాకర్ మాట్లాడుతూ తన రక్తం చిందించి ప్రజలను కాపాడడానికి అవతరించిన యేసుకు నిజమైన భక్తులుగా రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట: మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుందని చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. పట్టణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై కౌన్సిల్‌లో చర్చిస్తామన్నారు. కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని చైర్‌పర్సన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ విజయోత్సవ ర్యాలీకి తరలి రావాలి

మండపేట: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందిన అనంతరం ఈ నెల 28న తొలిసారిగా జిల్లాకు విచ్చేస్తున్న బొమ్మి ఇజ్రాయేల్‌కు స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున దళితులు తరలి రావాలని మండలంలోని ఏడిదకు చెందిన వైఎస్సార్ సీపీ దళిత నేత పలివెల సుధాకర్ కోరారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు రావులపాలెం నుంచి అమలాపురం మీదుగా ఆయన స్వగ్రామమైన గోడి వరకూ విజయోత్సవ ర్యాలీ జరుగుతుందన్నారు.

వెంకటరెడ్డి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



దుగ్గుదుర్రులో వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాజులూరు: శెట్టిబలిజ సంఘం నాయకులు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను బీసీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని అమలాపురం పార్లమెంట్ శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు అన్నారు. ఆదివారం దొమ్మేటి వెంకటరెడ్డి వర్ధంతి పురస్కరించుకుని దుగ్గుదుర్రులో ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, రామచంద్రపురం బీసీ సంఘ నాయకులు బాలగోపాల్, కట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లొల్లలో వైద్య శిబిరం



లొల్లలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రత్యూషరెడ్డి

రాయవరం: మండలంలోని లొల్ల గ్రామంలో సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాయవరం చాణక్య హాస్పిటల్ అధినేత డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి అధ్యక్షతన మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి (గైనిక్ జనరల్), డాక్టర్ జి.గోపి రవితేజ(ఆర్థో స్పెషలిస్ట్), డాక్టర్ జి.ప్రత్యూషరెడ్డి (గైనిక్)లు 80 మందికి వైద్య సేవలందించారు. వైద్య శిబిరంలో వైఎస్సార్ సీపీ నేతలు కత్తుల అప్పారావు, కోట వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ సప్తాహం ప్రారంభం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో నూతనంగా నిర్మించిన శ్రీపట్టాభి రామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామ సప్తాహం ప్రారంభమైంది. ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ సప్తాహంలో జిల్లాలో ప్రసిద్ధి చెందిన భజన బృందాలు పాల్గొని భక్తి కీర్తనలు ఆలపించారు. రామాయణంలోని ఘట్టాలను పద్యాల రూపంలో వివరించారు. వేకువజామున నిర్వహించిన మేల్కొలుపు సేవ, రాత్రి నిర్వహించిన పవళింపు సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ప్రధాన కూడలి .. వసతుల లేమి

- బస్ షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు
- టాయిలెట్లు లేక మహిళల అగచాట్లు
- మండపేట కలువ పువ్వు సెంటర్లో ఇదీ పరిస్థితి



కలువ పువ్వు సెంటర్ వద్ద రోడ్డుపైనే ప్రయాణికుల పడిగాపులు

మండపేట: మండపేట పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది కలువపువ్వు సెంటర్. ఈ కూడలిలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. పట్టణంలో ప్రధాన కూడలిగా గుర్తింపు పొందిన ఈ సెంటర్‌లో బస్సుల కోసం ఎదురు చూసే ప్రయాణికులు షెల్టర్, టాయిలెట్ల సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు.

విద్య, వైద్యం, వ్యాపారం తదితర కార్యకలాపాల నిమిత్తం రోజూ వేలాది మంది పరిసర గ్రామాల నుంచి మండపేట పట్టణానికి వచ్చి పోతుంటారు. కపిలేశ్వరపురం, కడియం, ఆలమూరు మండలాలతో పాటు మండలంలోని ఏడిద, వై.సీతానగరం, సావరం, కొత్తూరు తదితర గ్రామాల నుంచి వచ్చే ప్రజలు ఆర్టీసీ బస్సులు, ఆటోల కోసం కలువపువ్వు సెంటర్‌లోని ఏడిద రోడ్డు జంక్షన్‌కు చేరుకుంటారు. రావులపాలెం – కాకినాడ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఈ బస్టాప్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కాగా రోడ్డుకు ఇరువైపులా షెల్టర్లు లేకపోవడంతో నిలువనీడ కరవై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూనే షాపుల పక్కన రోడ్డుపైనే నిల్చుని బస్సుల రాక కోసం పడిగాపులు పడాల్సి వస్తోంది. కూర్చునేందుకు కనీస వసతి లేకపోవడంతో గర్భిణులు, పసి పిల్లలతో బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, రోగులు నరకయాతన పడుతున్నారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ బస్టాప్ వద్ద టాయిలెట్ల సదుపాయం లేక మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఆక్రమణలు తొలగించి షెల్టర్ నిర్మించాలి

బస్టాప్ వద్ద గల రామచంద్రుడు పంట కాలువపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి ప్రయాణికుల కోసం టాయిలెట్స్, షెల్టర్ నిర్మించాలన్న డిమాండ్ దీర్ఘకాలంగా ఉంది. ఈ విషయమై గతంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని కుల సంఘాల వారు మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు సర్వే నిర్వహించి 557 సర్వే నంబర్‌లో ఐదు సెంట్లకు పైగా ఇరిగేషన్ స్థలం ఆక్రమణలకు గురైనట్టు గుర్తించారు. కాగా ఆక్రమణదారులు కోర్టును ఆశ్రయించడం, అప్పట్లో టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు ఈ విషయాన్ని మరుగున పెట్టేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ఆక్రమణలు తొలగించి బస్ షెల్టర్, టాయిలెట్స్ నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



గ్రామదేవత ముత్యాలమ్మ

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర మహోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద గరగ నృత్యాలు, బ్యాండ్‌మేళాలు, బాణసంచా నిర్వహించారు. ఆదివారం రాత్రి, సోమవారం రాత్రి కూడా జాతర నిర్వహిస్తామని జాతర అనంతరం మంగళవారం ఉదయం నుంచి ఆలయం వద్ద తీర్థం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



టేకిలో మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- అందుకే సంక్షేమ పథకాల్లో పెద్ద పీట
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కపిలేశ్వరపురం, టేకిలలో వైఎస్సార్ ఆసరా సాయం పంపిణీ

కపిలేశ్వరపురం: ఆధునిక సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ప్రాధాన్యమైనదని, అందుకోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యుదయానికి పాటుపడుతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద టేకి, కపిలేశ్వరపురంలలోని మహిళా సంఘాలకు రుణాల మాఫీ సొమ్మును పంపిణీ చేశారు. ఆయా పంచాయతీల సర్పంచులు కుక్కల నాగమణి, సాకా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తోట, అతిథులుగా జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు ఉమ్మిడిశెట్టి వీరవేణి, శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ మండలంలో 1,504 సంఘాలకు చెందిన 14,176 మంది సభ్యుల ఖాతాలకు రూ.11.94 కోట్లు జమ అయ్యిందన్నారు. కపిలేశ్వరపురం సమావేశంలో తాతపూడి, కపిలేశ్వరపురం గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 257 సంఘాల పరిధిలో 2,580 మంది సభ్యులకు రూ.2,07,00868 రుణమాఫీ అయ్యిందన్నారు. టేకిలో నిర్వహించిన సమావేశంలో వాకతిప్ప, నాగులచెరువు, కోరుమిల్లి, మాచర, టేకి గ్రామాలకు చెందిన 436 సంఘాల పరిధిలోని 4,403 మంది సభ్యులకు రూ.4,18,13,488 మంజూరైందన్నారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన సంఘాలకు సైతం రుణమాఫీ సొమ్ము మంజూరు చేయించడంలో విశేష కృషి చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును మహిళా సంఘాల సభ్యులు అభినందించారు. తొలుత వైఎస్సార్‌కు నివాళి అర్పించారు. సర్పంచులు వాసంశెట్టి సునీత, ఎంపీటీసీ సభ్యులు జుత్తుక వెంకటలక్ష్మి, శీలం సూర్యావతి, పీఏసీఎస్ చైర్మన్లు మట్టపర్తి పాల్‌రాజ్, మద్దింశెట్టి దొరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో పేరుకే ప్రజాస్వామ్యం

కాజులూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో పేరుకే ప్రజాస్వామ్యం నడుస్తోందని ఆచరణలో ఎక్కడా అది కానరావడం లేదని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజుబాబు విమర్శించారు. ఆదివారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రోజుకోజుకీ ధరలు పెంచుతూ సామాన్య ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందని, ప్రపంచ దేశాల నుంచి లక్షలకోట్ల రుపాయలు అప్పులు తెచ్చి దేశ ప్రగతిని అప్పుల్లో ముంచిందన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలు అధికారం కోసం ఆరాటపడుతున్నాయే తప్ప ప్రజాసమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం మండల శాఖ అధ్యక్షుడు అల్లాడి నరసింహమూర్తి, కార్యదర్శి సువ్వారి గోవిందు, కురుపూడి భూచక్రం తదితరులు పాల్గొన్నారు.

గౌతమబుద్ధుని జీవితం స్ఫూర్తిదాయకం



గౌతమబుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరించిన డీవైఈవో షాలెంరాజు

రాయవరం: గౌతమ బుద్ధుని బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రామచంద్రపురం డీవైఈవో షాలెంరాజు అన్నారు. రాయవరం వివేకానంద పాఠశాల ఆవరణలో ఆదివారం రాత్రి కొత్తగా ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. పాఠశాల డైరెక్టర్ బీఏఎస్ సరోజిని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సమావేశంలో రాయవరం, రామచంద్రపురం ఎంఈవోలు వై.సత్యనారాయణ, మానుపూడి శ్రీనివాస్, రామచంద్రపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు నల్లమిల్లి జనార్దనరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ర్యాలి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. స్వామి వివేకానంద, సరస్వతీదేవి విగ్రహాలను కూడా ఆవిష్కరించారు. గౌతమ బుద్ధుని విగ్రహ శిల్పి రమణను సత్కరించారు.

కల్యాణ మండపానికి రూ.10 లక్షల మంజూరు



మంత్రి వేణు, కుమారుడు నరేన్‌లను సత్కరిస్తున్న స్టిల్‌విల్‌పేట నేతలు

రామచంద్రపురం: మున్సిపాలిటీ పరిధిలోని స్టిల్ విల్‌పేటలో మాదిగల కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు స్టిల్‌విల్‌పేటకు చెందిన నాయకులు, వైఎస్సార్ సీపీ నేతలు మంత్రి వేణు, ఆయన కుమారుడు నరేన్‌లను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ రూ.20 లక్షలతో నిర్మించే కల్యాణ మండపానికి తొలివిడత పనులు జరిపేందుకు నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. మందపల్లి చిట్టిబాబు, దొమ్మలపాటి లాలి ప్రసాద్, జుత్తుక ఉదయ్‌కాంత్, గంపల పృథ్వీరాజ్, కొమ్ము సురేష్, పెందుర్తి పిలవెంకన్న, సాగర్ టైలర్, యూత్ సభ్యులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు పాటుపడాలి



నూతన కమిటీకి ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న నరసింహమూర్తి మాస్టారు తదితరులు

కాజులూరు: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కాకినాడ జిల్లా అధ్యక్షుడు ధమ్మాచారి ఉపాసక అన్నారు. కాజులూరు అంబేడ్కర్ భవనంలో ఆదివారం మండల దళిత యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులుగుమాటి నరసింహమూర్తి మాస్టారు ఆధ్వర్యంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మండల సమావేశం నిర్వహించి నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ పోతు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పి.రాంప్రసాద్, ఆర్.సత్తిబాబు, కార్యాదర్శిగా వి.ధమ్మప్రసాద్, కోశాధికారిగా ఎం.వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా జె.రాజేష్, ఎం.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వంశీకుమార్, మధు, పలువురు కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా నియమితులయ్యారు.

ముగిసిన త్రిరాత్ర దీక్షా చండీయాగం



చండీ యాగాన్ని తిలకిస్తున్న భక్తులు

రాయవరం: స్థానిక పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవీ వసంత త్రిరాత్ర శ్రీ రుద్ర సహిత చండీయాగం ఆదివారంతో ముగిసింది. ఓం శక్తి సత్సంగం ఆధ్వర్యంలో ఈ నెల 24న చండీయాగం ప్రారంభమైంది. గ్రామస్తుల సహకారంతో ఆలయ ప్రధానార్చకులు విలపర్తి ఫణిధర్‌శర్మ, శశిధర్‌శర్మ పర్యవేక్షణలో సుమారు 10 మంది వేద పండితులు ఈ చండీయాగంలో పాల్గొన్నారు. యాగంలో పార్వతీ సమేత రాజేశ్వరస్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. చండీయాగంలో భాగంగా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యాగ దంపతులచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి మూల మంత్ర, పంచసూక్త, నవగ్రహ హోమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయం వద్ద ఉదయం 11గంటలకు ఘనంగా అన్న సమారాధన నిర్వహించనున్నట్టు యాగ నిర్వాహకులు తెలిపారు.

24 డ్వాక్రా గ్రూపులకు రూ.60.10 లక్షల రుణమాఫీ



తాడిపల్లిలో జరిగిన రుణమాఫీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు సతీష్

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాడిపల్లి గ్రామంలో 24 డ్వాక్రా గ్రూపుల్లోని 242 మంది మహిళలకు ఈ ఏడాది మూడో విడత రుణమాఫీతో కలిపి రూ.60,10,479 రుణమాఫీ జరిగిందని ఆ గ్రామ ఎంపీటీసీ రెడ్నం వీవీ సత్యనారాయణ అన్నారు. గ్రామంలో డ్వాక్రా గ్రూపు సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పిల్లి అచల రాజశ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సతీష్ మాట్లాడుతూ గ్రామంలోని 242 మంది డ్వాక్రా మహిళలకు రూ.20,03,493 రుణమాఫీగా బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పిల్లి బాలసుబ్రహ్మణ్యం, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు కొప్పిశెట్టి ఆదిలక్ష్మి, కార్యదర్శి డెక్కా సుగుణమల్లి, కోశాధికారి మాధవరపు నాగకామేశ్వరి, సభ్యులు పాల్గొన్నారు.

గృహసారథులతో పాలన మరింత చేరువ

చైర్‌పర్సన్ దుర్గారాణి



కాలనీవాసులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ప్రజలకు చేరువగా మరింత మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గృహ సారథులను నియమించారని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. పట్టణంలోని 20వ వార్డు గొల్లపుంత కాలనీలో ఆదివారం రాత్రి ఆమె గృహ సారథులతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. స్థానికులకు గృహ సారథులను పరిచయం చేస్తూ కాలనీవాసులతో మమేకమయ్యారు. ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. స్థానికుల తెలిపిన సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. అనంతరం చైర్ పర్సన్ దుర్గారాణి మీడియాతో మాట్లాడుతూ పాలనలో పారదర్శకత, ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. క్షేత్రస్థాయిలో మరింత మెరుగైన పాలన కోసం తీసుకువచ్చిన గృహసారథులు సమర్థవంతమైన పాత్ర పోషిస్తారన్నారు. జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, సచివాలయ కన్వీనర్లు గునిపే భూషణం, పేరూరి మాధవి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొబ్బరి అభివృద్ధి మండలి కార్యాలయాన్ని అమలాపురానికి మార్చాలి

అయినవిల్లి: విజయవాడలో ఉన్న కొబ్బరి అభివృద్ధి మండలి రాష్ట్ర కార్యాలయాన్ని అమలాపురానికి మార్చాలని బీజేపీ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ కోరారు. ఆదివారం అయినవిల్లిలోని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు విళ్ల దొరబాబు స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నల్లా పవన్ మాట్లాడుతూ కోనసీమ పరిసరా ప్రాంతాల్లో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు రావాలన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన రాష్ట్ర కొబ్బరి అభివృద్ధి మండలి అమలాపురం పరిసర ప్రాంతాల్లో ఉండటం వల్ల కొబ్బరి రైతులకు మేలు చేకూరుతుందన్నారు. కోనసీమ జిల్లా పరిధిలో 50,285 హెక్టార్లలో కొబ్బరి సాగవుతుందన్నారు. 668 కొబ్బరి ఉత్పత్తి సొసైటీలు ఉన్నాయన్నారు.

50 కొబ్బరి ఉత్పత్తిదారుల సమాఖ్యలు ఉన్నాయన్నారు. 5 కొబ్బరి ఉత్పత్తిదారుల కంపెనీలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కొబ్బరి ఉప ఉత్పత్తుల కంపెనీలు రావడం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి చేరే అవకాశం ఉన్నారు. ఈ విషయమై తాను పార్లమెంట్ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ కలసి చర్చించానన్నారు. ఆయన వెంట జిల్లా కిసాన్ మోర్చా ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి వేగి వెంకటేశ్వరరావు, జిల్లా మోర్చా ఐటీ సెల్ కన్వీనర్ కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు యనమదల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

అట్టలు, పెన్నుల పంపిణీ

అయినవిల్లి: మండలంలోని విలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన చిల్లా నరసింహమూర్తి, గుండుమోగుల శ్రీనివాసరావు ఆదివారం పరీక్ష అట్టలు, పెన్నులు, కంపాస్‌బాక్సులు పంపిణీ చేశారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు.

ఉత్సాహంగా ఫేర్ వెల్ డే



ప్రధానోపాధ్యాయిని సుందరిని సత్కరిస్తున్న విద్యార్థులు



నృత్యాలతో అలరించిన విద్యార్థినులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థుల ఫేర్ వెల్ డేను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి మాట్లాడుతూ చక్కని ప్రణాళిక ద్వారా ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధమవ్వాలని సూచించారు. ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలతో సందడి నెలకొంది. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు నున్న కల్యాణచక్రవర్తి, కోటిపల్లి అబ్బు, పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.వేల కోట్ల ఖర్చు

పి.గన్నవరం: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.వేలాది కోట్లు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని కె.ఏనుగుపల్లిలో రూ.8 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్ తోరం సత్యనారాయణ, ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, నాయకులు కొల్లే శ్రీను, దొమ్మేటి దుర్గారావు, కడలి సీతారాముడు, శేరు తిరుపతిరావు, సత్తిబాబు, గంధం ఏసు, సూదా శ్రీను, యల్లమెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రజ్ఞా వికాసం బహుమతి

కొత్తపేట: పదో తరగతి విద్యార్థులకు ఐఎస్ఎఫ్–యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పేరిట నిర్వహించిన పరీక్షల్లో స్థానిక విద్యాబాలమందిర్ విద్యార్థిని పసుపులేటి సూర్యవెంకట దుర్గాస్వాతి మండల ప్రైవేట్ పాఠశాలల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందని ఆ పాఠశాల కరస్పాండెంట్ ఆర్.అనూరాధ ఆదివారం తెలిపారు. అమలాపురంలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) చేతుల మీదుగా మెమెంటో, మెడల్, సర్టిఫికెట్ అందజేసినట్టు తెలిపారు.

రూ.5.50 కోట్లతో అన్నదాన భవనం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి సంబంధించి రూ.5.50 కోట్ల నిధులతో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. వారు మాట్లాడుతూ రోజురోజుకూ ఆలయంలో భక్తుల సందడి పెరుగుతుందన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నదాన పథకానికి సంబంధించి రూ.5.50 కోట్లతో భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా సోమవారం ఉదయం శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు.

భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవాలి

అంబాజీపేట: భగవద్గీత సారాంశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, గీతలోని శ్లోకాలు వాటి అర్థాలను విశదీకరించేందుకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి నరసింహాచార్యులు పేర్కొన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో కొలువుదీరిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విష్ణు సహస్ర నామ, భగవద్గీత శ్లోకాలపై ఆదివారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. అర్చకుడు నరసింహాచార్యులు మాట్లాడుతూ గురువు ద్వారా పొందిన ఉపదేశానికి ప్రామాణికముంటుందన్నారు. ఎన్నో శతాబ్దాల క్రితం పంచమ వేదముని మహాత్ములచే చెప్పబడిన భగవద్గీత భక్తి, జ్ఞాన, వైరాగ్యాల అమూల్యమైన సారమున శ్రీకృష్ణ పరమాత్ముడు పాండవ మధ్యముడు అర్జునుడికి వివరించిన దివ్యోపదేశమన్నారు. గీతాసారం పఠనం ద్వారా మానవుల్లో ఉన్న దుర్గుణాలు పారద్రోలి ముక్తి మార్గమునకు మూలమైన మోక్షం ప్రసాదింపబడుతుందన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నరసింహాచార్యులు సూచించారు.